సాక్షి సూర్యాపేట

మంగళవారం । 23 । జనవరి । 2024



ప్రాణప్రతిష్ట రోజు కాన్పులు
బాలరాముడు ప్రాణప్రతిష్ట సందర్భంగా కొందరు గర్భిణులు ఆస్పత్రుల్లో కాన్పులు చేయించుకున్నారు. - 10లో



గోవా మద్యం పట్టివేత
మిర్యాలగూడలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన గోవా మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. - 10లో



కమిషనర్‌ను తొలగించాలని..
తిరుమలగిరి మున్సిపల్ కమిషనర్‌ను తొలగించాలని చైర్‌పర్సన్ రజనీ సోమవారం ధర్నా చేశారు. -12లో

న్యూస్‌రీల్

పోలీస్ కుటుంబాల సంక్షేమానికి కృషి



పోలీస్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట క్రైం: పోలీస్ కుటుంబాల సంక్షేమానికి కృషిచేస్తున్నట్లు ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దస్తగిరి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ ఇద్దరి కుటుంబాలకు జిల్లా పోలీస్ సంక్షేమ చేయూత పథకం కింద చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామచందర్‌గౌడ్, సూపరింటెండెంట్ శ్రీకాంత్, ఆర్ఎస్ఐ అశోక్ పాల్గొన్నారు.

ఫిర్యాదులపై స్పందించాలి

ఫిర్యాదులపై పోలీస్ అధికారులు వెంటనే స్పందించాలని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు తమ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

విద్యార్థులు ఇష్టంతో చదువుకోవాలి



వాలీబాల్ కోర్టును ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, టీచర్లు

చిలుకూరు: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదువుకోవాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, మిజోరం సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ముత్తు సూచించారు. సోమవారం చిలుకూరు మండలం నారాయణపురం జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం పాఠశాల ఆవరణంలో వాలీబాల్, కబడ్డీ కోర్టులను సర్పంచ్ తమ్మనబోయిన శంకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మండవ శైలజ, పాఠశాల హెచ్ఎం గుజ్జుల నరసింహారెడ్డి, గ్రామ కార్యదర్శి శౌరిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడిగా బాలకృష్ణ



నియామకపత్రం అందుకుంటున్న అలకుంట్ల బాలకృష్ణ

నాగారం : వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడిగా నాగారం మండలం ఫణిగిరి గ్రామానికి చెందిన అలకుంట్ల బాలకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సూర్యాపేటలో నిర్వహించిన తెలంగాణ వడ్డెర సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. బాలకృష్ణకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అవిమల్లు నియామక పత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడారు. వడ్డెర సంఘం బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా వడ్డెరులను పట్టించుకునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చి న్యాయం చేయాలని కోరారు. తన ఎన్నికకు సహకరించిన వడ్డెర సంఘం నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర వెంకన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎత్తరి గణేష్, అలకుంట్ల ఉపేందర్, శివరాత్రి రాంబాబు, దండుగుల సైదులు, వరికుప్పల నవీన్, శివరాత్రి గోపి తదితరులు పాల్గొన్నారు.

24న ఎన్ఎస్ఎస్ పీఓల సమావేశం

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఈనెల 24న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారుల (పీఓల) సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్ఎస్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ మద్దిలేటి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని పీఓలంతా విధిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు.



మార్మోగిన రామనామం

నడిగూడెం శ్రీ సాయి పబ్లిక్ స్కూల్‌లో వివిధ వేషధారణల్లో చిన్నారులు



అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ట సందర్భంగా సోమవారం సూర్యాపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న రామభక్తులు



సూర్యాపేటలో జైశ్రీరామ్ ఆకృతిలో ప్రమిదలను వెలిగిస్తున్న మహిళలు

సీఎంఆర్ ప్లీజ్!

- మిల్లర్లను వేడుకుంటున్న అధికారులు
- 2022–23 వానాకాలం బియ్యం 28,234 మెట్రిక్ టన్నులు పెండింగ్
- నెలాఖరుతో ముగియనున్న గడువు
- టార్గెట్ పూర్తి చేసేందుకు యత్నాలు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) అప్పగించడంలో జిల్లాలోని రైస్‌మిల్లర్లు తీవ్ర జాప్యం చేస్తున్నారు. మూడు సీజన్లు ముగిసినా 2022–23 వానాకాలం సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ ఇప్పటి వరకు 17శాతం పెండింగ్‌లోనే ఉంది. దీనికోసం అధికారులు సమావేశాలు పెట్టి మిల్లర్లను వేడుకుంటున్నారు. ఈనెలాఖరుతో ముగియనున్న గడువులోగానైనా టార్గెట్ పూర్తి చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

బియ్యంగా మార్చి ఇచ్చేందుకు..

ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన వడ్లను మరపట్టి బియ్యంగా మార్చి తిరిగి ఇచ్చేందుకు సీఎంఆర్ కింద మిల్లర్లకు అప్పగిస్తుంది. మిల్లింగ్ చేసిన అనంతరం బాయిల్డ్ రైస్ అయితే 68 శాతం, రా రైస్ అయితే 67 శాతం చొప్పున ఎఫ్‌సీఐకి తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకు క్వింటాకు రూ.30 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. దీనికితోడు పొట్టు, తవుడు కూడా మిల్లర్లకే మిగులుతాయి. కానీ సీఎంఆర్ బియ్యం అప్పగించడంలో మిల్లర్లు తీవ్ర జాప్యం చేస్తున్నారు.



28,234 మెట్రిక్ టన్నులు పెండింగ్

జిల్లాలో పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో 2022–23 వానాకాలంలో 3,13,333మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి 59 మిల్లులకు అందజేసింది. ఈ సీజన్‌లో మిల్లర్లు 2,10,261మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సివిల్‌సప్లయ్ శాఖకు అందజేయాలి. 2022–23 యాసంగి సీజన్, 2023–24 వానాకాలం సీజన్ కూడా పూర్తి అయింది. ఈ సీజన్లకు సంబంధించిన ధాన్యం మిల్లులకు చేరింది.

వారంలో మూడు సమావేశాలు

సీఎంఆర్ విషయమై గతనెలలో వారం రోజుల్లోనే మూడు సార్లు సమావేశాలు నిర్వహించారు. పౌరసరఫరాల శాఖ మంత్రి రివ్యూ అయిపోగానే, కలెక్టర్ వెంకట్రావు, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిలు మిల్లర్లతో సమావేశాలు పెట్టారు. సీఎంఆర్ ఇవ్వాలని మిల్లర్లను అధికారులు వేడుకుంటున్నారు.

హెచ్చరించినా మారని తీరు

మిల్లర్ల నుంచి ఎఫ్‌సీఐకి సీఎంఆర్ బియ్యాన్ని ఇప్పించేందుకు ఇప్పటివరకు తీసుకున్న చర్యలు సత్ఫలితాల్ని ఇవ్వలేదు. పలుమార్లు గడువు విధించినా మిల్లర్లు బియ్యం అప్పగించడంలో విఫలమయ్యారు. దీంతో సీఎంఆర్ పెండింగ్‌లో ఉన్న మిల్లులకు 2023–24 వర్షాకాలం ధాన్యాన్ని కేటాయించకూడదని పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఓ రివ్యూలో ఆదేశించారు. అంతే కాకుండా బియ్యం ఇవ్వని మిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం ఆస్తులు జప్తు చేసేందుకు వెనకాడేది లేదని హెచ్చరిస్తున్నారు. అయినా మిల్లర్ల తీరులో మార్పు రాలేదు.

కానీ ఇప్పటివరకు 2022–23 వానాకాలానికి సంబంధించి 1,72,027 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ మాత్రమే ఇచ్చారు. ఇంకా 28,234 మెట్రిక్ టన్నులు బకాయి ఉంది. పెండింగ్ సీఎంఆర్ ఇవ్వడానికి ఈనెల 31వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం గడువు విధించింది.

ప్రధానంగా 4 మిల్లుల వద్దే..

2022–23 వానాకాలంలో జిల్లా వ్యాప్తంగా సేకరించిన ధాన్యాన్ని 59 మిల్లులకు కేటాయించారు. ఇందులో ఇప్పటి వరకు 83 శాతం సీఎంఆర్ సేకరించారు. 41 మిల్లులు 100 శాతం సీఎంఆర్ ఇచ్చాయి. పెండింగ్‌లో ఉన్న 28,234 మెట్రిక్ టన్నులు అంటే 17 శాతం సీఎంఆర్ 18 మిల్లులు బకాయి ఉన్నాయి. కాగా ఇందులో ప్రధానంగా కోదాడకు చెందిన శ్రీ వెంకటేశ్వర మిల్లు 9,889 మెట్రిక్ టన్నులు, నేరేడుచర్ల శ్రీ సంతోషిమా మిల్లు 6,864 మెట్రిక్ టన్నులు, తిరుమల మిల్లు 6,308 మెట్రిక్ టన్నులు, సూర్యాపేట కాసరబాదకు చెందిన శ్రీ వెంకటేశ్వర 3,291 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బకాయిలు ఉన్నాయి.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

- కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంకతో కలిసి అర్జీలను స్వీకరించిన అనంతరం అధికారులతో మాట్లాడారు. ప్రజావాణిలో 17 దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. ప్రజలు మండలంలో సమస్యలు పరిష్కారం కాక కలెక్టరేట్‌కు వస్తున్నారని అన్నారు. ఈ విషయంలో మండల అధికారులు ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, జెడ్పీసీఈఓ సురేష్ కుమార్, డీఎఫ్ఓ సతీష్ కుమార్, సీపీఓ వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధి కల్పనాధికారి మాధవరెడ్డి, డీడబ్ల్యూఓ జ్యోతి పద్మ, ఎస్సీ అభివృద్ధి అధికారి శిరీష, డీపీఓ యాదయ్య, డీఏఓ రామారావు నాయక్ పాల్గొన్నారు.

ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

జిల్లాలో ఈ నెల 25వ తేదీన జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు ఆదేశించారు. జాతీయ ఓటరు దినోత్సవ నిర్వహణపై అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక, అధికారులతో కలిసి సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఓటరు దినోత్సవానికి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. డివిజన్ కేంద్రాల్లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఓటరు దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసాపత్రాలు ఇవ్వాలన్నారు. ముగ్గులు, కబడ్డీ పోటీలు నిర్వహించాలన్నారు. ఓటరు దినోత్సవ ఆవశ్యకతను యువతకు తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, జెడ్పీ సీఈఓ సురేష్, డీపీఓ యాదయ్య పాల్గొన్నారు.

24న సెల్ఫీవిత్ డాటర్

ఈనెల 24న జాతీయ బాలికాదినోత్సవం సందర్భంగా సెల్ఫీ విత్ డాటర్ కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్త్రీ, శిశు, సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో, బేటీపడావో కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. అధి కారులు, సిబ్బంది తమ పిల్లలతో సెల్ఫీ దిగియాప్‌లో పోస్ట్ చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో బాలికలకు వ్యాస రచన, ఉపన్యాస పోటీలతో పాటు అవగాహన కార్యాక్రమలు నిర్వహించాలన్నారు. అలాగే ఇమాంపేట రెసిడెన్షియల్ స్కూల్‌లో బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమ ఉద్దేశాన్ని వివరిస్తూ గాలి పటాలు ఎగురవేయనున్నట్లు చెప్పారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలి

గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని 475 గ్రామ పంచాయతీల్లో ప్రాథమిక అవసరాలను గుర్తించి సదుపాయాల కల్పనకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. వీటి వివరాలను ఈనెల 31లోగా ఈ–గ్రామసభ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు.



కలెక్టరేట్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకట్రావు, చిత్రంలో అదనపు కలెక్టర్ ప్రియాంక

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో గణతంత్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు అధికారులను ఆదేశించారు. గణతంత్ర వేడుకల నిర్వహణపై సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంకతో కలిసి ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గణతంత్ర దినోత్సవం రోజు వివిధ శాఖల ద్వారా ఆకర్షణీయమైన స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. వేడుకలకు సంబంధించి ప్రొటోకాల్ పాటిస్తూ సీటింగ్ ఏర్పాటు చేయాలని, పరేడ్ గ్రౌండ్, స్టేజ్, తాగునీటి సరఫరా ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని సూచించారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని వీఐపీలందరికీ తప్పనిసరిగా గణతంత్ర దినోత్సవ ఆహ్వాన పత్రిక అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు

విద్యా వైజ్ఞానిక సభలను జయప్రదం చేయాలి



సూర్యాపేటలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

సూర్యాపేటటౌన్ : ఫిబ్రవరి 11, 12 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించే టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముప్పాని కృష్ణారెడ్డి కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. టీపీటీఎఫ్ ఏడు దశాబ్దాలుగా విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎన్నో ఉద్యమాలు నిర్వహించిందన్నారు. అందరికీ సమాన విద్య అందాలని ఎజెండాగా పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పేరం ముత్తయ్య, ప్రధాన కార్యదర్శి సీహెచ్.భిక్షం, వెంపటి కృష్ణవేణి, సుభాని, తీగల పూలన్, రామనర్సయ్య, వీరన్న, రవికుమార్, కృష్ణమూర్తి, నర్సయ్య, శంకర్, జానయ్య, కిరణ్, కోటేశ్వర్‌రావు, శ్యామ్‌సుందర్ రెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు ఉద్యమించాలి

నల్లగొండ టౌన్: ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలని న్యాయవాది దర్శనం నర్సింహ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లూరి కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం నల్లగొండలోని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘ భవన్‌లో నిర్వహించిన పీడీఎస్‌యూ జిల్లా మహాసభలో వారు మాట్లాడారు. నేడు విద్యారంగం పూర్తిగా కార్పొరేట్ సంస్థల చేతిలోకి వెళ్లిందన్నారు. విద్యారంగానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో 10 శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులకు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. అంతకు ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం సంఘం జెండాను జిల్లా అధ్యక్షుడు బొల్లూరి అనిల్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సభలో సీపీఐఎంఎల్ నాయకులు బొంగరాల నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి వర్కాటపు సైదులు, రవి, రాజు, సుసేన, లక్ష్మి, శ్రీను, అంజిబాబు, వినిత్, నవీన్, రమ్య, తనూజ, అశోక్, మధు, సాయికుమార్, మల్లేష్, రవిందర్, శృతి, రజిత, శ్రావణి, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో నిత్యారాధనలు



శివుడికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట రూరల్ : యాదాద్రికి అనుబంధంగా ఉన్న పర్వతవర్థిని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సంప్రదాయ పూజలు నిర్వహించారు. మహాశివుడికి రుద్రాభిషేకం, బిల్వార్చన పూజలు చేశారు. నైవేద్యం సమర్పించారు. ఇక యాదాద్రీశుడి ప్రధానాలయంలోనూ స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులకు సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు.. శ్రీస్వామి, అమ్మవారికి సుప్రభాత సేవ చేపట్టి అభిషేకం, అర్చన చేశారు. అనంతరం ఆలయ ముఖమండపం, ప్రాకార మండపాల్లో ఉత్సవమూర్తులకు సుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణం, జోడుసేవలు తదితర కైంకర్యాలు గావించారు.

• ప్రజావాణి కాలక్షేపానికేనా..!

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కొందరు అధికారులు సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేస్తున్నారు. విధుల్లో ఉన్నామన్న విషయం మరిచి యూ ట్యూబ్‌లో వీడియోలు చూస్తూ అందులో లీనమైపోయారు. ఈ దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట







సెల్‌ఫోన్‌లో యూట్యూబ్ చూస్తున్న పలువురు అధికారులు

ఎలా ముందుకెళ్దాం..!



తెలంగాణ భవన్‌లో జరిగిన నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ చర్చ
- ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారు కార్యకర్తలను పట్టించుకోలేదని ఆగ్రహం
- మాజీ ఎమ్మెల్యేలకు బాధ్యతలిస్తే పనిచేయబోమని పలువురి స్పష్టీకరణ
- సమన్వయ కమిటీల నేతృత్వంలోనే నిర్ణయాలు తీసుకోవాలని సూచన
- బయటి జిల్లాల నుంచి ఇన్‌చార్జీలను నియమించే ఆలోచనలో అధిష్టానం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన బీఆర్ఎస్.. పార్లమెంట్ ఎన్నికల్లో విజయం కోసం దిద్దుబాటు చర్యలకు సిద్ధమైంది. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ముఖ్య కార్యకర్తలతో సన్నాహక సమావేశాలను నిర్వహిస్తోంది. పార్లమెంట్ ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలన్న విషయంలో వారి నుంచి అభిప్రాయాలను తీసుకుంటోంది. ఇందులో భాగంగా సోమవారం హైదరాబాద్‌లో నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించింది. దీనికి జిల్లా నుంచి మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితోపాటు నల్లగొండ జెడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ముఖ్య నేతలు హాజరయ్యారు. మొన్నటివరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగా ఉన్నవారు స్థానిక నాయకులను, కార్యకర్తలను పట్టించుకోలేదని, ఐదేళ్లపాటు ఏకపక్షంగా వ్యవహరించారని పలువురు నాయకులు ఆరోపించినట్లు సమాచారం. ఎమ్మెల్యేలుగా ఓడిపోయిన వారికి అసెంబ్లీ నియోజకవర్గాల్లో బాధ్యతలు ఇవ్వొద్దని తెగేసి చెప్పినట్లు తెలిసింది. వారికి బాధ్యతలు ఇస్తే తాము సహకరించబోమని స్పష్టం చేసినట్లు తెలిసింది. అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ముగ్గురు నలుగురు ముఖ్య నేతలతో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసి, ఏ నిర్ణయమైనా వారు తీసుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించినట్లు తెలిసింది. నాయకులు, కార్యకర్తల ఆవేదనను అర్థం చేసుకున్నామని చెప్పిన ముఖ్య నాయకులు.. పార్లమెంట్ ఎన్నికల్లో ఎలా ముందుకు సాగాలో సూచించాలని కోరారు. కాగా, ఓడిపోయిన ఎమ్మెల్యేలకు కాకుండా ఎమ్మెల్సీలకు బాధ్యతలు ఇవ్వాలని ఆలోచనలు చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు లేని చోట ఇతర జిల్లాల నుంచి ఇన్‌చార్జిలను నియమించే ఆలోచనల్లో పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే సూర్యాపేట నుంచి మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయనకే నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. ఇటీవల జరిగిన భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశంలోనూ నాయకులు, కార్యకర్తలు కూడా ఇదే రకమైన అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

పెరుగుతున్న ఆశావహులు

నల్లగొండ పార్లమెంట్ స్థానానికి బీఆర్ఎస్ నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. మొన్నటివరకు తన కుమారుడు గుత్తా అమిత్‌రెడ్డికి నల్లగొండ ఎంపీగా పోటీచేసేందుకు బీఆర్ఎస్ టికెట్ ఇవ్వాలని పట్టుపట్టిన శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఇప్పుడు నల్లగొండ, భువనగిరిలో ఎక్కడ టికెట్ ఇచ్చినా పోటీ చేస్తామని అంటున్నారు. మరోవైపు కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి, హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి కూడా ఎంపీ టికెట్ అడుగుతున్నట్లు తెలిసింది. సోమవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఇక.. భువనగిరి ఎంపీ టికెట్‌ను పైళ్ల శేఖర్‌రెడ్డి అడుగుతున్నట్లు తెలిసింది. అధిష్టానం కూడా ఆయనవైపే మొగ్గు చూపుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం


ఘటనాస్థలిని పరిశీలిస్తున్న ఆర్‌ఐ సైదులు

త్రిపురారం : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైంది. త్రిపురారం మండలం బెజ్జికల్ గ్రామంలో సోమవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బెజ్జికల్ గ్రామానికి చెందిన కందుకూరి పాపయ్య సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. రోజు మాదిరిగానే పాపయ్య సెంట్రింగ్ పనులకు, ఇతడి భార్య కూలికి వెళ్లారు. వీరి కుమారుడు, అతడి స్నేహితుడు గుడిసెలో టీవీ చూస్తుండగా షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు లేచాయి. గుడిసెకు అంటుకుని మంటలు ఎగిసి పడుతుండడంతో గమనించిన చిన్నారులు బయటికి పరుగులు తీసి కేకలు వేశారు. స్థానికులు పంచాయతీ ట్యాంకర్‌తో నీటిని తీసుకువచ్చి మంటలు ఆర్పివేశారు. ప్రమాదంలో గుడిసెలో ఉన్న గృహోపకరణాలు, బియ్యం, రూ.10 వేలు కాలిపోయాయి. త్రిపురారం ఆర్‌ఐ సైదులు సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. రూ.80వేల ఆస్తినష్టం జరిగిందని ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

కంప్రెషర్ ట్రాక్టర్ తిరగబడి వ్యక్తి మృతి


ఘటనాస్థలిలో బోల్తాపడిన ట్రాక్టర్


ఇరగదిండ్ల ప్రవీణ్ (ఫైల్)

దేవరకొండ : కంప్రెషర్ ట్రాక్టర్ తిరగబడడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. దేవరకొండ మండలం తూర్పుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బొల్లిగుట్ట వద్ద చోటుచేసుకుంది. కొండమల్లేపల్లి మండలం దోనియాల గ్రామపంచాయతీకి చెందిన ఇరగదిండ్ల వెంకటేశం కుమారుడు ఇరగదిండ్ల ప్రవీణ్(25) కంప్రెషర్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొమ్మరి లక్ష్మయ్య వద్ద పని కుదరడంతో రోజు మాదిరిగానే సోమవారం కూడా కంప్రెషర్ ట్రాక్టర్ నడుపుతున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ తిరగబడి మీదపడడంతో మృతిచెందాడు. మృతుడికి భార్య, రెండేళ్ల వయస్సున్న కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

చికిత్స పొందుతున్న తాత, మనుమరాలు మృతి


బానోతు జోత్స్న(ఫైల్)

తుంగతుర్తి : గ్యాస్ సిలిండర్ పేలిన ప్రమాదంలో గాయపడి తాత, మనుమరాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. తుంగతుర్తి మండలం ఏనెకుంట తండాకు చెందిన బానోతు అమృ, బానోతు జ్యోత్స్నలు ఈ నెల 17న ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ పేలింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బానోతు అమృ(65) బానోతు జ్యోత్స్న (10) సోమవారం మృతి చెందారు. తాత, మనుమరాలు ఒకే రోజు మృతిచెందడంతో తండాలో విషాదఛాయలు నెలకొన్నాయి.

బాలరాముని ప్రాణప్రతిష్ట రోజున కాన్పులు


మౌనిక, గౌండ్లగూడెం, నిడమనూరు మండలం


రాజీబాయి, సీత్యాతండా, హాలియా మండలం

నల్లగొండ టౌన్: అయోధ్యలో బాలరాముడు విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మంచి రోజుగా భావించి సోమవారం నల్లగొండ జిల్లాలో పలువురు గర్భిణులు ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల కోసం చేరారు. నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు నాగార్జునసాగర్, మిర్యాలగూడ, దేవరకొండ, నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో మూడు రోజులుగా డెలివరీల కోసం చేరారు. అయినప్పటికీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులకు ప్రాధాన్యత ఇచ్చారు. కానీ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో మాత్రం బాలరాముడు విగ్రహ ప్రాణప్రతిష్ఠ రోజే సిజేరియన్ చేసైనా కాన్పు చేయించుకోవాలని చేరినట్లు తెలిసింది. మూడు రోజులుగా (శుక్ర, శని, ఆదివారాల్లో) కంటే సోమవారం ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎక్కువ కాన్పులు జరిగినట్లు వైద్య ఆరోగ్య శాఖ గణాంకాలు చెబుతున్నాయి. బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ రోజున తమకు పిల్లలు జన్మించడం చాలా ఆనందంగా ఉందని తమకు పుట్టిన బిడ్డలకు శ్రీరాముడు, సీతమ్మ అనే పేర్లు పెట్టుకుంటామని నల్లగొండలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సాధారణ కాన్పు అయిన మహిళలు పేర్కొంటున్నారు.

నల్లగొండ జిల్లాలో నాలుగు రోజులుగా జరిగిన డెలివరీల సంఖ్య ఇలా..

తేదీ	ప్రభుత్వ	ప్రైవేట్
19	47	13
20	44	12
21	21	07
22	18	22

చాలా సంతోషంగా ఉంది

అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ రోజున బాబు పుట్టడం చాలా సంతోషంగా ఉంది. నార్మల్ డెలివరీ కావడం మరింత ఆనందంగా ఉంది. మా బాబుకు శ్రీరాముని పేరు కలిసే విధంగా పెట్టుకుంటాం.

– మౌనిక, గౌండ్లగూడెం, నిడమనూరు మండలం

సీతమ్మ పేరు పెట్టుకుంటాం..

బాలరాముడి విగ్రహం ప్రతిష్ఠించిన ముహూర్తాన కూతురు పుట్టింది. ఈ రోజు మాకు అమ్మాయి పుట్టినందుకు చాలా సంతోషంగా ఉంది. మా పాపకు సీతమ్మ అనే పేరు పెట్టుకుందామని అనుకుంటున్నాం.

–రాజీబాయి, సీత్యాతండా, హాలియా మండలం

మిర్యాలగూడలో గోవా మద్యం పట్టివేత

- 34 మద్యం ఫుల్ బాటిళ్లు స్వాధీనం
- ఇద్దరి అరెస్టు, రిమాండ్


పట్టుబడిన మద్యం, నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

మిర్యాలగూడ అర్బన్ : ఇంట్లో అక్రమంగా నిలువ చేసిన గోవా మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు పట్టుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మహేశ్వర్‌రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. మిర్యాలగూడ పట్టణంలోని అశోక్‌నగర్, గాంధీనగర్ కాలనీలకు చెందిన శివనాగేంద్ర, దేవేందర్ స్నేహితులు.శివనాగేంద్ర బీటెక్ చదువుతుండగా, దేవేందర్ ఉన్నత విద్యకు విదేశాలకు వెళ్లే ప్రయత్నాల్లో ఉన్నాడు. ఫిబ్రవరిలో శివనాగేంద్ర పుట్టిన రోజు వేడుక సందర్భంగా స్నేహితులకు మందు పార్టీ ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు. అందుకు అవసరమైన మద్యాన్ని స్నేహితుడు దేవేందర్ కలిసి ఇటీవల కారులో గోవాకు వెళ్లి తీసుకువచ్చారు. అలా తీసుకువచ్చిన 34 బాటిళ్ల మద్యాన్ని ఇంట్లో నిల్వ చేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. శివనాగేంద్ర, దేవేందర్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ మహేశ్వర్‌రెడ్డి వివరించారు. అక్రమ మద్యం (నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్) తెచ్చినా, విక్రయాలు సాగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు డి.రామకృష్ణ, ఎస్‌కె.పర్వీన్, వై.లావణ్యతో పాటు ఇతర ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకుని మహిళ బలవన్మరణం

దేవరకొండ : ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకుంది. దేవరకొండలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. దేవరకొండ పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన రాణి(23) గతంలో రెండు పెళ్లిళ్లు చేసుకొని విడాకులు తీసుకుంది. అనంతరం వరంగల్ జిల్లా హన్మకొండలోని ఓ బట్టల దుకాణంలో పనిచేస్తూ జీవనం సాగించింది. ఈ క్రమంలో అక్కడ సుమన్ అనే వ్యక్తితో ఏర్పడిన పరిచయాన్ని చనువుగా తీసుకొని అతని నుంచి రూ.లక్ష నగదు, పది గ్రాముల బంగారం తీసుకొని తిరిగి దేవరకొండకు వచ్చి తల్లితో కలిసి ఉంటుంది. సుమాన్ హన్మకొండ పోలీస్ స్టేషన్‌లో ఈనెల 18న రాణిపై ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టేందుకు హన్మకొండ నుంచి పోలీసులు దేవరకొండకు వచ్చారు. విచారణ నిమిత్తం హన్మకొండ పోలీస్‌స్టేషన్‌కు రావాల్సిందిగా ఆదేశించారు. ఈ క్రమంలోనే మనస్తాపానికి గురైన రాణి సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుమార్తె ఎంతకి బయటికి రాకపోవడంతో తల్లి కళమ్మ కేకలు వేయడంతో చుట్టుపక్కల వాళ్లు వచ్చి తలుపులు పగలగొట్టి చూడగా రాణి అప్పటికే విగత జీవిగా వేలాడుతుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

శుభకార్యానికి వెళ్తూ అనంతలోకాలకు..

- బైక్‌ను ఢీకొట్టిన లారీ.. మహిళ, బాలుడు మృతి
- స్వల్పగాయాలతో బయటపడిన ఉపాధ్యాయుడు
- అనంతగిరి మండలం శాంతినగర్‌లో ఘటన


నాగమణి (ఫైల్)


యశ్వంత్ (ఫైల్)

అనంతగిరి: ఆనందంగా శుభకార్యానికి వెళుతున్న వారిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. కళ్ల ముందే కట్టుకున్న భార్య, మరదలు కొడుకు మృత్యువాత పడడంతో భర్త కన్నీరు మున్నీరుగా విలపించాడు. ఈ హృదయ విదారక సంఘటన సోమవారం ఉదయం అనంతగిరి మండల పరిధిలో శాంతినగర్ వద్ద కోదాడ– ఖమ్మం రహదారిపై చోటు చేసుకుంది. అనంతగిరి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హుజూర్‌నగర్ మండలం మాధవరాయినిగూడునికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పుట్టపాక నరసింహారావు తన భార్య నాగమణి (35) మరదలు కొడుకు మోదాల యశ్వంత్‌తో కలిసి ఖమ్మంలో జరిగే శుభకార్యానికి బైక్‌పై బయలుదేరారు. మార్గమధ్యలో కోదాడ నుంచి ఖమ్మం వెళుతున్న లారీ వీరి బైక్‌ను శాంతినగర్ శివాలయం సమీపంలో వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ముగ్గురు కింద పడిపోగా యశ్వంత్, నాగమణిలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందారు. నరసింహారావు హెల్మెట్ పెట్టుకోవడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. నరసింహారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అనంతగిరి ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

ఆవుల పట్టివేత

కోదాడరూరల్ : ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న ఆవులను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. కోదాడ మండల పరిధిలోని గుడిబండ శివారులో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒడిశా నుంచి మేళ్లచెర్వు మీదుగా 98ఆవులను తరలిస్తున్న డీసీఎం పట్టుబడినట్లు తెలిపారు. ఆవులను హైదరాబాద్‌లోని గోశాలకు తరలించి, డీసీఎం డ్రైవర్‌తో పాటు వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి

- పాఠశాలలో ప్రార్థన నిర్వహిస్తుండగా స్పృహ తప్పి పడిపోయిన విద్యార్థిని
- దేవరకొండ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి
- కొండమల్లేపల్లి ఎస్సీ గురుకుల పాఠశాలలో ఘటన


భార్గవి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కొండమల్లేపల్లి : అనుమానాస్పద స్థితిలో బాలిక మృతిచెందింది. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ఎస్సీ గరుకుల బాలికల పాఠశాలలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్ద అడిశర్లపల్లి మండలం అంగడిపేట గ్రామానికి చెందిన దాసరి ఆంజనేయులు, అండాలు దంపతులకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు సంతానం. రెండో కుమార్తె భార్గవి కొండమల్లేపల్లిలోని ఎస్సీ గురుకుల బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఇటీవల సంక్రాంతి పండుగ సందర్భంగా సెలవులు ప్రకటించడంతో ఇంటి వద్ద ఉన్న భార్గవిని ఆదివారం సాయంత్రం తండ్రి హాస్టల్‌లో దిగబెట్టి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం పాఠశాలలో ప్రార్థన నిర్వహిస్తున్న క్రమంలో భార్గవి స్పృహ తప్పి పడిపోయింది. వెంటనే పాఠశాల సిబ్బంది బాలికను తొలుత కొండమల్లేపల్లి ఆస్పత్రికి అక్కడి నుంచి దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.


భార్గవి (ఫైల్)

ఆస్పత్రి ఎదుట ఆందోళన

భార్గవి మృతి విషయం తెలుసుకున్న తల్లిదండ్రులతో పాటు ఇతర కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో దేవరకొండ ఆస్పత్రికి చేరుకున్నారు. భార్గవి మృతిని జీర్ణించుకోలేక గుండెలవిసేలా రోదించారు. న్యాయం చేయాలంటూ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. వీరికి విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. కొండమల్లేపల్లి ఎస్సీ గురుకుల పాఠశాల పాఠశాల ప్రిన్సిపాల్, ఆర్‌సీఓ (రీజనల్ కోఆర్డినేటర్)ను సస్పెండ్ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ఆందోళన విరమించ లేదు. విషయం తెలుసుకున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఆస్పత్రి వద్దకు చేరుకొని బాలిక తల్లిదండ్రులకు న్యాయం చేస్తామని హామీనిచ్చారు. అనంతరం బాలిక మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్గవి తండ్రి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

సమగ్ర దర్యాప్తు జరిపించాలని వినతి



ఆర్‌సీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్‌ఐ నాయకులు

కొండమల్లేపల్లిలోని ఎస్సీ గురుకుల బాలికల పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని భార్గవి మృతిపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్‌సీఓ అరుణకుమారికి వినతిపత్రం అందజేశారు. ముున్ముందు ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు రమావత్ లక్ష్మణ్, బుడిగ వెంకటేశ్, మహి, పాషా, శివ, రవీందర్ తదితరులున్నారు.

గుండెపోటుతోనేనా..?

భార్గవి ఆదివారం సాయంత్రం హాస్టల్‌కు వచ్చినప్పటి నుంచి ఎలాంటి ఆహారం తీసుకోలేదని, దీంతో నీరసంగా ఉందని తోటి విద్యార్థులు పేర్కొంటున్నారు. ఉదయం పాఠశాల ఆవరణలో ప్రార్థన నిర్వహిస్తుండగా భార్గవి స్పృహ తప్పి పడిపోయింది. ఆ సమయంలో ఫిట్స్ లక్షణాలు కనిపించాయని తోటి విద్యార్థులు అంటున్నారు. ఈ క్రమంలోనే భార్గవిని గుండెపోటు వచ్చి మృతిచెందినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నట్లు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు. పోస్టుమార్టం నివేదిక వస్తేనే భార్గవి మృతికి గల కారణాలు వెల్లడవుతాయని ఎస్‌ఐ తెలిపారు.

పార్వతీపురంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలి

- దోమల వ్యాప్తితోనే జ్వరాలు
- నల్లగొండ డీఎంహెచ్‌ఓ కొండల్‌రావు


పార్వతీపురం గ్రామస్తులు, వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కొండల్‌రావు

నిడమనూరు: నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం పార్వతీపురం గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలని డీఎంహెచ్‌ఓ కొండల్‌రావు పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. గ్రామానికి కీడు సోకిందని ఆదివారం ప్రజలు వనవాసం వెళ్లిన పార్వతీపురాన్ని సోమవారం ఆయన సందర్శించారు. గ్రామంలో అన్ని వీధులు తిరిగి మురుగు కాల్వలు, బోర్ల చుట్టూ నిలిచిన నీటిని పరిశీలించారు. నీటి నిలువ వల్లే దోమలు పెరిగి జ్వరాలు వస్తున్నాయని తెలిపారు. పంచాయతీ సిబ్బంది పార్వతీపురం, శాఖపురం గ్రామాల్లోని ఆయా వాడల్లో మురుగు కాలువలు శుభ్రం చేయాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ కొండల్‌రావు గ్రామంలో తిరుగుతూనే డీపీఓతో ఫోన్లో మాట్లాడి సమస్యను వివరించారు. సంబంధిత పంచాయతీల వారు పారిశుద్ధ్య పనులు వెంటనే చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. గ్రామంలో హెల్త్ క్యాంపు నడుస్తుందని, ప్రజలు భయాందోళన చెందొద్దన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట డీఎంఓ దుర్గయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కేశ రవి, పీహెచ్‌సీ వైద్యాధికారి మాదవ్‌కుమార్, అంకతి సత్యం, బొజ్జ లాజీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భువనగిరి క్రైం : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన భువనగిరిలో సోమవారం చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి భువనగిరి వరకు వస్తున్న ట్రాలీ ఆటోను పట్టణ పరిధిలోని పత్తి కంపెనీ వద్ద వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆటో అదుపుతప్పి పక్కనే ఉన్న గుంతలో బోల్తా పడింది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న రామచంద్రాపురం గ్రామానికి చెందిన చింతల జహంగీర్, సావిత్రి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

బాలుడికి గాయాలు

రామగిరి(నల్లగొండ): రోడ్డు ప్రమాదంలో నాలుగేళ్ల బాలుడికి గాయాలయ్యాయి. తిప్పర్తి మండలం సిలార్మియాగూడేనికి చెందిన రాయి ప్రవీణ్ తన అల్లుడు శశాంక్(4)తో కలిసి తిప్పర్తికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళుతున్న సమయంలో రైల్వేస్టేషన్ సమీపంలో వారు రోడ్డు దాటుతుండగా వెనుక వైపు నుంచి వస్తున్న టీవీఎస్ ఎక్సెల్ వాహనం శశాంక్‌ను ఢీకొనడంతో గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన యాదయ్యపై ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ధర్మ తెలిపారు.

పాలమూరు ప్రాజెక్టుతో నల్లగొండకు అన్యాయం

మునుగోడు: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుతో నల్లగొండకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. సోమవారం మునుగోడులోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ ప్రాజెక్టు ద్వారా నల్లగొండకు సాగునీరు అందదని, ఎస్ఎల్‌బీసీలో అంతర్భాగమైన డిండి ఎత్తిపోతల పథకం ద్వారానే సాగు నీరు అందుతుందన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని వెంటనే పూర్తిచేసి చెర్లగూడెం, కిష్టరాంపల్లి రిజర్వాయరల్లో నీరు నింపాలని కోరారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బెల్టు షాపులు మూసివేయించడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా మునుగోడుకు చెందిన బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు రేవెల్లి అంజయ్య ఆ పార్టీకి రాజీనామా చేసి సీపీఐలో చేరారు. ఈ సమావేశంలో ఆ పార్టీ మండల కార్యదర్శి చాపల శ్రీను, సురిగి చలపతి, బొల్గూరి నర్సింహ, గుర్జ రామచంద్రం పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

నకిరేకల్ : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సోమవారం సాయంత్రం నకిరేకల్ పోలీసులు పట్టుకున్నారు. నకిరేకల్‌కు చెందిన కాసం భద్రయ్య, కట్టంగూరు మండలం బొల్లేపల్లికి చెందిన రవి నకిరేకల్ మండలం మండలాపురంలో మంచాల కిషోర్ వద్ద నుంచి సేకరించిన 40క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బొలేరో వాహనంలో తరలిస్తున్నారు. స్థానిక తిప్పర్తి రోడ్డు పోలీసులు బొలేరో వావానాన్ని పట్టుకుని సీజ్ చేశారు. బియ్యం తరలిస్తున్న భద్రయ్య, రవిలపై కేసు నమోదు చేశామని సీఐ రాజశేఖర్ తెలిపారు.

రెండో విడత నిధులు విడుదల చేయాలి

- దళితబంధు లబ్ధిదారుల ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న లబ్ధిదారులు

భువనగిరిటౌన్ : దళితబంధు రెండో విడతలో ఎంపికైన వారికి నిధులు విడుదల చేయాలని కోరుతూ అడ్డగూడూరు మండలానికి చెందిన లబ్ధిదారులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండో విడత కోసం గత ప్రభుత్వం లబ్ధిదారులను ఎంపిక చేసిందన్నారు. ఈలోగా ఎన్నికల షెడ్యూల్ వచ్చినందున నిధులు విడుదల చేయలేదన్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం చొరవచూపి యూనిట్లకోసం వెంటనే నిధులు ఇవ్వాలని, దళితబంధు పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు బాలెంల విద్యాసాగర్, తాళ్లపల్లి కృష్ణ, బోడ సోమయ్య, పిల్లి గంగయ్య, అల్వాల శంకర్, బాలెంల సురేష్, పోలపాక అబ్బులు, తలపాక మహేష్, మందుల కిరణ్, బాలెంల నరేందర్, బట్ట వెంకటయ్య, దర్శనాల మహేందర్, దడిదే బాబు, మందుల మహేష్, తాలపక శేఖర్, బోనాల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యం తేవడమే లక్ష్యం

భువనగిరిటౌన్ : ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ప్రజానాట్యమండలి లక్ష్యమని తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్ద శ్రీనివాస్ అన్నారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా ముఖ్య కళాకారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రజానాట్యమండలి, ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27నుంచి జీపు యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. హైదరాబాదులోని మగ్దూం మొహినుద్దీన్ విగ్రహం నుంచి ప్రారంభమై మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల మీదుగా యాదాద్రి జిల్లా కేంద్రానికి యాత్ర చేరుకుంటుందన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి జీపు యాత్రకు స్వాగతం పలకాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏషాల అశోక్, తెలంగాణ ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు బుషిపాక నరసింహ, ఉప్పుల కొమురయ్య పాల్గొన్నారు.

ఫిర్యాదులపై విచారణ చేయాలి


బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ చందనాదీప్తి

నల్లగొండ క్రైం: పోలీస్ గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి వెంటనే నివేదిక ఇవ్వాలని జిల్లా ఎస్పీ చందనా దీప్తి ఆదేశించారు. సోమవారం నల్లగొండ జిల్లాపోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డేకు ఆమె హాజరై బాధితుల ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. భూ వివాదాలు, ఫైనాన్స్ వ్యవహారాలు, కుటుంబ తగాదాలు శాంతి భద్రతల సమస్యగా మారకుండా చూడాలన్నారు. పోలీస్ శాఖపై నమ్మకం కలిగించేలా బాధితులకు భరోసా కల్పించాలన్నారను. ఫిర్యాదులను ఆన్‌లైన్ చేసి పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు.

ఎన్నికల విధులపై అవగాహన ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న నల్లగొండ కలెక్టర్ హరిచందన

- నల్లగొండ కలెక్టర్ హరిచందన

నల్లగొండ: రానున్న పార్లమెంట్ ఎన్నికల విధులపై సెక్టార్ అధికారులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏఆర్‌ఓలు, సెక్టార్ అధికారులు, అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సెక్టార్ అధికారులు పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాల కల్పనతో పాటు సెక్టార్ రూట్ మ్యాప్ రూపొందించాలన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు గుర్తించి ఎన్నికల సందర్భంగా కేంద్ర సాయుధ బలగాలు, వెబ్ కాస్టింగ్, మైక్రో అబ్జర్వర్లు, వీడియోగ్రఫీకి ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ శాతం పరిశీలించి, ఓటింగ్ ఎక్కడైనా ఓటు వేయలేని పరిస్థితి ఉంటే అవసరమైతే తగిన భద్రత కల్పించి స్వేచ్ఛగా ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈవీఎంల పనితీరుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ పరమేశ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సెక్టార్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఏఆర్‌వోలు (ఆర్‌డీఆర్‌లు) రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.